

### కొర్ర రైతుకు ధరాఘాతం
మార్కెట్‌లో కొర్రల ధర పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గతేడాది డిసెంబరు నెలలో లభించిన ధరతో పోలిస్తే నేడు సగం కూడా దక్కడం లేదు. 8లో▸



### గ్రామానికో శంకర్ దాదా..
విద్యార్హతలు లేకపోయినా కొందరు ఆర్‌ఎంపీలు అన్ని రకాల రోగాలకూ చికిత్స చేసేస్తున్నారు. మరి కొందరు స్పెషల్ సర్జన్లుగా అవతారమెత్తి పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. 8లో▸



### టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తిమట్టం | : 1,633 అడుగులు |
| ప్రస్తుతం | : 1,632 |
| టీఎంసీల సామర్థ్యం | : 105.788 |
| ప్రస్తుతం | : 101.773 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 23,314 |
| అవుట్ ఫ్లో(క్యూసెక్కులు) | : 21,358 |

## న్యూస్‌రీల్

### అరుణాచలానికి స్పెషల్ బస్సులు

నంద్యాల (వ్యవసాయం): పౌర్ణమిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఈనెల 18న నంద్యాల డిపో నుంచి అరుణాచలం దేవస్థానానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 17 వ తేది ఉదయం 7.30 గంటలకు డిపో నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. ఈ యాత్రలో కాణిపాకం విగ్నేశ్వరుడు, అరుణాచలం గిరి ప్రదక్షిణ, తరువాత వేలూరు స్వర్ణ దేవాలయం దర్శనం అనంతరం నంద్యాలకు తిరిగి బయలు దేరుతుంది అన్నారు. రాను పోను టికెట్ ధర రూ. 1,750 అని, వివరాలకు 73828 73580కు సంప్రదించాలన్నారు.

### రేపటి నుంచి జొన్నలు, కొర్రల క్రయ, విక్రయాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు మరో రెండు పంటలను అమ్ముకునే సదుపాయాన్ని కల్పించడానికి మార్కెట్ కమిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి మార్కెట్ యార్డులో రైతులు పండించిన సజ్జలు, జొన్నల క్రయ, విక్రయాలు చేపట్టనున్నారు. ఈ-నామ్ పద్ధతిలో జొన్నలు, సజ్జలను కొనుగోలు చేయడానికి వ్యాపారులు (ట్రేడర్లు) ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు ఈ పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దళారీలకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. దీనిని గుర్తించిన మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు మార్కెట్ యార్డులో జొన్న, సజ్జల క్రయ, విక్రయాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కొనుగోలు ప్రక్రియను మంగళవారం ప్రారంభించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రైతులు అవకాశాన్ని వినియోగించుకొని పంటలను గిట్టుబాటు ధరతో అమ్ముకోవాలని కోరారు.

### నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నంద్యాల(అర్బన్): స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో నేడు (సోమవారం) నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాదున్ నబీ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు దినం ప్రకటించడంతో ఈనిర్ణయం తీసుకున్నామని ప్రజలు గమనించాలన్నారు.

### పోతిరెడ్డిపాడు నుంచి పెరిగిన నీటి విడుదల



జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 25 వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 41,287 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో 883.50 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు వద్ద 882.50 అడుగుల నీటిమట్టం ఉండగా హెడ్‌రెగ్యులేటర్ ఆరుగేట్ల ద్వారా 30వే ల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని బానకచర్ల నీటిని యంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 12వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కాల్వకు 15వేల క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 3 వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 50రోజుల్లో అంటే జూలై 27 నుంచి ఇప్పటి వరకు 1008.39 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

### 19 నుంచి ఇసుక ఆన్‌లైన్‌లో బుకింగ్


కర్నూలు న్యూసిటీ: ఇసుకను వినియోగదారులే స్వయంగా ఆన్‌లైన్ బుక్ చేసుకునే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19వ తేదీ నుంచి ప్రజలకు ముందుకు తీసుకొస్తుందని మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మైనింగ్ శాఖ వద్ద ఇసుక రవాణా కోసం అగ్రిమెంట్ చేసుకున్న వాహనాల ద్వారా సరఫరా చేస్తారని తెలిపారు. రవాణాదారులు అధిక డబ్బులు వసూలు చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నిబంధనలను రూపొందించిందన్నారు. అధిక వసూలు చేసినా, రవాణాలో నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రవాణాదారులు తమ వాహనాల వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ట్రాక్టర్లు రూ.1,500, 6 టైర్ల లారీలు రూ.3,000, 10 టైర్ల లారీలు రూ. 6,000, 12,14,16 టైర్ల లారీలు రూ.10,000 చెల్లించి అగ్రిమెంట్ చేయించుకోవాలని సూచించారు.

### సీట్లు తగ్గితే చాలా నష్టపోతాం



ఎన్నో ఆశలతో చదువుతున్న నాలాంటి విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయంతో చాలా నష్టపోతారు. డాక్టర్ కావాలని రూ.వేలల్లో నగదు, సమయం వెచ్చించి నీట్ కోచింగ్ తీసుకుంటున్నాను. ఇప్పుడు ఎంబీబీఎస్ సీట్లు తగ్గితే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మంచి ర్యాంక్ వచ్చినా సీటు వస్తుందో రాదోననే భయం ఉంది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మా తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించి ప్రైవేట్‌లో వైద్య విద్య చదివించలేరు. మెడికల్ సీట్లు వద్దని రాసిన లేఖను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

–షేక్ గౌస్, నీట్ విద్యార్థి, చాగలమర్రి




### విద్యార్థులకు అన్యాయం



రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే జగన్‌కు పేరు వస్తుందనే కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. ఉన్నత చదువులను రాజకీయం చేసి పేద విద్యార్థుల కలలను దూరం చేయరాదు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రస్తుతం నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేద, మధ్య తరగతి పిల్లలు వైద్య విద్య చదవలేరు. వారికి అన్యాయం జరగకుండా సీఎం చంద్రబాబు తన నిర్ణయంపై పునరాలోచన చేయాలి. –గంగుల రామిరెడ్డి, ఆళ్లగడ్డ

### మంత్రి వ్యాఖ్యలు సరి కావు



ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్)రాష్ట్రంలో మెడికల్ కళాశాలలకు అనుమతి ఇచ్చింది. అందులో పులివెందుల మెడికల్ కాలేజీ కూడా ఉంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ కాలేజీకి సీట్లు కేటాయించవద్దని ఎన్ఎంసీకి లేఖ రాయడం సరికాదు. నూతన కళాశాలల్లో బోధన, మౌలిక వసతులు కల్పించలేక రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కారణాలు చెప్పడం, గత ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు చేయడం సరికాదు. ఇదంతా వైద్య విద్యార్థులను అన్యాయం చేయడమవుతుంది. – డాక్టర్ థామస్, నంద్యాల

# ధీమాకు ఎసరు!

కూటమి ప్రభుత్వం అన్నదాతను విస్మరిస్తోంది. ఇప్పటికే ప్రతి ఏటా రూ. 20వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయకపోగా తాజాగా సాగులో రైతుకు ధీమా నిచ్చే ఉచిత పంటల బీమా పథకానికి ఎసరు పెడుతోంది. ఖరీఫ్ పంటలకు మాత్రమే ప్రీమియం చెల్లిస్తామని, రబీ పంటలకు రైతులే ప్రీమియం కట్టుకోవాలని కొర్రీ పెడుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి సర్కారు అవలంభిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిపై రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



కొలిమిగుండ్ల మండలం అబ్దులాపురం సమీపంలో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న వరి

- ఉచిత పంటల బీమా పథకం అమలులో సర్కారు నిర్లక్ష్య ధోరణి
- రబీ పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలని ప్రకటన
- ఖరీఫ్ కంటే రబీకే పంటల బీమా అవసరమంటున్న రైతులు
- రెండు సీజన్లలో ఉచితంగా బీమా ప్రీమియం చెల్లించి ఆదుకున్న గత వైఎస్సార్‌సీపీ సర్కార్
- జిల్లాలో ఈ ఏడాది 1.36 లక్షల హెక్టార్లలో రబీ పంటల సాగు లక్ష్యం
- కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఆందోళనలో రైతన్నలు

కోవెలకుంట్ల: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగించారు. వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల ఉచిత విద్యుత్, ప్రతి ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం, గ్రామ సచివాలయాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని రసాయన ఎరువులు, ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు ఎప్పటికప్పుడు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమా వర్తింప చేసి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే అదే సీజన్‌లో నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ వర్తింపుతో రైతులకు అండగా నిలిచారు. మూడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు రైతుల సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. ప్రతి ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి తుంగలో తొక్కింది.

| గత ప్రభుత్వ హయాంలో 2021 సంవత్సరంలో ఇన్సూరెన్స్ వర్తింపు వివరాలు | | |
|---|---|---|
| నియోజకవర్గం | రైతుల సంఖ్య | వర్తించిన మొత్తం |
| బనగానపల్లె | 11,526 | రూ. 16.78 కోట్లు |
| ఆళ్లగడ్డ | 8,974 | రూ. 12.95 కోట్లు |
| డోన్ | 42,899 | రూ. 39.86 కోట్లు |
| నంద్యాల | 3,122 | రూ. 9.14 కోట్లు |
| శ్రీశైలం | 6,100 | రూ. 3.93 కోట్లు |
| నందికొట్కూరు | 14,045 | రూ. 29.22 కోట్లు |
| పాణ్యం, గడివేముల | 2,563 | రూ. 4.19 కోట్లు |

| 2022వ సంవత్సరంలో బీమా వర్తింపు వివరాలు | | |
|---|---|---|
| నియోజకవర్గం | పంటకోత ప్రయోగం ద్వారా | వాతావరణ ప్రభావంతో |
| బనగానపల్లె | రూ. 3.59 కోట్లు | రూ. 4.34 లక్షలు |
| ఆళ్లగడ్డ | రూ. 8.18 కోట్లు | రూ. 2.02 కోట్లు |
| డోన్ | రూ. 6.82 కోట్లు | రూ. 9.24 కోట్లు |
| నంద్యాల | రూ. 1.78 కోట్లు | రూ. 19.91 లక్షలు |
| శ్రీశైలం | రూ. 86 లక్షలు | రూ. 12.99 లక్షలు |
| నందికొట్కూరు | రూ. 10.33 కోట్లు | - |
| పాణ్యం, గడివేముల | రూ. 2.63 కోట్లు | రూ. 1.64 కోట్లు |



కోవెలకుంట్ల సమీపంలో గత ఏడాది వర్షాలు కురవక ఎండిపోయిన పప్పుశనగ (ఫైల్)

#### కలిసిరాని ఖరీఫ్

జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.82 లక్షల హెక్టార్లలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో అనేక పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. బాధిత రైతులకు నష్ట పరిహారం అందించేందుకు పంటల బీమా వర్తింప చేసి రైతులను ఆదుకోవాల్సిన కూటమి సర్కార్ ఖరీఫ్ పంటలకు సంబంధించి 22 రకాల పంటలకు బీమా వర్తింప చేస్తామని ఇటీవల జీఓ విడుదల చేసింది. బీమా ప్రీమియం చెల్లింపు ప్రక్రియ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. అలాగే ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇంకా 50 వేల హెక్టార్లకు పైగా పంటలు సాగు చేయాల్సి ఉంది. వారం రోజుల క్రితం వరకు కురిసిన వర్షాలతో పంటల సాగు కుంటుపడింది. ఖరీఫ్ ముగిసేందుకు ఇంకా రెండు వారాలు మాత్రమే గడువు ఉంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాలు బీళ్లుగా మారటంతో ఆయా పొలాల్లో ఖరీఫ్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఖరీఫ్‌లో మిగిలిపోయిన విస్తీర్ణంతోపాటు ఈ ఏడాది రబీ సీజన్‌లో 1.36 లక్షల హెక్టార్లలో రబీ పంటలు సాగు కానున్నాయి.

#### రబీ పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలి

కూటమి సర్కార్ రైతులపై కపట ప్రేమ ప్రదర్శిస్తోంది. ఖరీఫ్ పంటల కంటే రబీ పంటలకు ఉచిత పంట బీమా అవసరం. ఉదాహరణకు కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో 20 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగవుతాయి. సబ్ డివిజన్‌లో రబీ సీజన్‌లో దాదాపు 75 వేల హెక్టార్లల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ సబ్ డివిజన్లలో ఖరీఫ్ కంటే రబీలో అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. దీనికి తోడు రబీలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎక్కువశాతం పంట నష్టం సంభవిస్తుంది. విత్తనానికి ముందు వర్షాలు అంతంత మాత్రంగానే కురియడం, పంట వివిధ దశల్లో తుఫాన్ల కారణంగా పంటలు దెబ్బతినడం, తదితర ప్రకృతి వైపరీత్యాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపి రైతులు నష్టపోతున్నారు. ఈ పంట నమోదు ఆధారంగానే పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుంది. అయితే, ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు ప్రీమియం చెల్లిస్తామని, రబీ పంటలకు రైతులే ప్రీమియం కట్టుకోవాలని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. గత వైఎస్సార్‌సీపీ సర్కారులాగా రబీ పంటలకు కూడా ఉచిత పంటల బీమా వర్తింప చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

#### కష్టకాలంలో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే అదే సీజన్‌లో నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకుంది. నంద్యాల జిల్లాలో 2021వ సంవత్సరంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటనష్టం సంభవించగా 89, 199 మంది రైతులకు రూ. 123 కోట్లు, 2022వ సంవత్సరంలో 49,637 మంది రైతులకు దాదాపు రూ. 100 కోట్లను ఇన్సూరెన్స్ రూపంలో చెల్లించిన ఘనత వైఎస్ జగన్ సర్కారుదే.

#### గత ప్రభుత్వం రెండు సీజన్లకు బీమా వర్తింపజేసింది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్, రబీ పంటలకు ఉచిత పంటల బీమా వర్తింప చేసి ప్రీమియం చెల్లించింది. నాకున్న రెండు ఎకరాల సొంత పొలంతో పాటు ఎకరా రూ. 10వేలు కౌలు చెల్లించి మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని ఈ ఏడాది వ్యవసాయానికి సిద్ధమయ్యాను. ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాల కౌలు పొలంలో బెండ సాగు చేశాను. మిగిలిన పంటలను రబీ సీజన్‌లో సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నాను. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత పంటల బీమా ఖరీఫ్‌కే పరిమితం చేయడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

#### ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకోవాలి



నాకున్న మూడున్నర ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగు చేయాల్సి ఉంది. రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఎకరన్నర పొలంలో మిరప సాగు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు మాత్రమే పంటలకు మాత్రమే ప్రీమియం చెల్లిస్తామని ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. జిల్లాలో రబీ సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యే ఆస్కారం ఉంది. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సైతం ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకోవాలి. – కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

# కస్తూర్బాల్లో కష్టాల పాఠం

- కేజీబీవీ సిబ్బందికి సమస్యలు
- ఒత్తిడి లేని చదువులంటూ.. టీచర్లపై పని భారం
- టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు వార్డెన్ డ్యూటీలు



గోస్పాడు కేజీబీవీ

గోస్పాడు: బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు) పాఠశాల సిబ్బంది సమస్యలతో సతమతమవుతున్నాయి. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో చేరిన టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఓ వైపు చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తూ మరో వైపు పని ఒత్తిడితో వేదనకు గురవుతున్నారు. జిల్లాలో మొత్తం 27 కేజీబీవీలు ఉండగా అందులో దాదాపు 365 మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పని చేస్తున్నారు. అన్ని కేజీబీవీల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియెట్‌ను కూడా ప్రవేశపెట్టారు. గురుకుల పాఠశాలల తరహాలోనే విద్య, వసతి సౌకర్యం కలిపి ఉంటుంది. విద్యావిధానం ప్రకారం టీజీటీ, పీజీటీ పోస్టులు ఉండాలి. 6 నుంచి 8వ తరగతి వరకు టీజీటీలు, 9, 10, ఇంటర్మీడియట్ పీజీటీ పోస్టులు ఉండాలి. ఒక్కో సబ్జెక్టుకు రెండు పోస్టులు ఉండాలి. 6 నుంచి 10వ తరగతి వరకు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్టీ)లు బోధిస్తున్నారు. పీజీటీ సీఆర్‌టీలు ం ఇంటర్ మాత్రమే బోధిస్తున్నారు. దీంతో పాటు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు 6 నుంచి ఇంటర్ వరకు ఒక్కొక్కరే బోధిస్తున్నారు. మిగిలిన సబ్జెక్టులు 6 నుంచి 10వ తరగతి వరకు ఒకరే బోధిస్తుండగా ఇంటర్‌కు పీజీటీలు బోధిస్తున్నారు. ఇలా బోధకులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజు వారి బోధన అవర్స్ కూడా పెరిగాయి. విద్యా విధానం ప్రకారం బోధకులను నియమించాలని ఉన్నతాధికారులను కోరుతున్నా ఫలితం లేదు.

#### నైట్ డ్యూటీలతో ఇబ్బందులు...

కేజీబీవీల్లో వసతి గృహం ఉంది. కానీ వార్డెన్ పోస్టు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. ఉదయం 9 గంటలకు వెళ్లి నైట్ డ్యూటీ చేసుకొని మరుసటి రోజు ఉదయం 11 గంటలకు డ్యూటీ దిగాల్సి వస్తోంది. దీంతో పాటు సెలవు దినాల్లో ప్రత్యేకంగా పగలు షిఫ్ట్, నైట్ సిఫ్ట్ డ్యూటీలు చేయాలి. ఇలా డ్యూటీ చేసి విద్యాబోధన చేయాలంటే మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. అదే వార్డెన్ పోస్టు ఉంటే రాత్రి సమయంలో వార్డెనే చూసుకుంటారు.

#### ఎంటీఎస్ వర్తింపు చేయాలి..

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జీవోలు ఉన్నా అధికారులు వర్తింపజేయడం లేదని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. కేజీబీవీల్లో అందరూ మహిళలే కావడంతో బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో ఉన్నాధికారుల బెదిరింపులు ఎక్కువగానే ఉంటాయి. క్యాజువల్ లీవ్‌లు కూడా వారు చెప్పినట్లే వాడుకోవాల్సిన పరిస్థితి. ఉద్యోగం వదులు కుంటే బతుకుదెరువు పోతుందేమేనని ఇటు మానుకోలేక, అవస్థలు చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

#### ఫలితం మెరుగుపడినా..

డ్రాప్ అవుట్స్ బాలికల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో ప్రస్తుతం అడ్మిషన్లు లభించడం కష్టంగా మారింది. అంతా ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. అడ్మిషన్ కావాలంటే రికమెండేషన్లు పెట్టుకున్నా కుదరని పరిస్థితి. అంతా ఆన్‌లైన్, రోస్టర్ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు. లోకల్, నాన్ లోకల్ విధానంలో సీట్ల భర్తీ ఉంటుంది. అందరూ బాలికలే కావడంతో సెక్యూరిటీ బాగుంటుందనే ఆలోచనతో తల్లిదండ్రులు ఆడ పిల్లలను కేజీబీవీల్లో చేర్పేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ విద్యాలయాలకు ఇంత పేరు రావడానికి కష్టపడిన తమకు పనికి తగిన జీతాలు ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

#### చాలీచాలని వేతనాలతో అవస్థలు..

6 నుంచి ఇంటర్ వరకు బోధించే వారికి ఇచ్చే జీతంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టానికి తగిన ఫలితం లేకుండా పోయిందని నిరుత్సాహంగా ఉన్నారు. కేజీబీవీల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రిన్సిపాళ్లకు రూ.34,139, సబ్జెక్టు సీఆర్టీలు, పీఈటీలకు, పీజీటీలకు రూ.26,759 జీతం. అవుట్ సోర్సింగ్ కింద ఏఎన్ఎంకు, అకౌంటెంట్‌కు రూ. 15 వేలు, ఒకేషనల్, కంప్యూటర్ సిబ్బందికి రూ.14,203, కుకింగ్ డే, నైట్ వాచ్‌మన్, స్వీపర్లకు రూ.12 వేల జీతం ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈ జీతాలతో జీవనం సాగించాలంటే కష్టంగా ఉంటుందని, ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలు,ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు చూసుకుంటే తిరిగి అప్పు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

# గణనాథునికి ఘన వీడ్కోలు

- కర్నూలులో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



కర్నూలు నగర నడిబొడ్డున కేసీ కెనాల్‌లో నిమజ్జనోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనోత్సవం కనులపండువగా సాగింది. ఎనిమిది రోజుల పాటు నిత్య పూజలందుకున్న బొజ్జ గణపయ్య తొమ్మిదో రోజు ఆదివారం అశేష భక్తుల మధ్య గంగమ్మ ఒడి చేరుకున్నారు. 44వ సంవత్సరం ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయం వద్ద వినాయక నిమజ్జన శోభాయాత్రను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రివర్యులు టీజీ భరత్, శోభాయాత్ర, వినాయక్ ఘాట్‌లో నిమజ్జనాన్ని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బైరెడ్డి శబరి, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కోడుమూరు, ఆదోని శాసనసభ్యులు గౌరుచరిత, బొగ్గుల దస్తగిరి, వాల్మీకి పార్థసారధి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హాఫీజ్ ఖాన్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేనివిధంగా నగరం నడి మధ్యలో వినాయక్ ఘాట్‌లోని కేసీ కాల్వలో విఘ్నేశ్వరునికి ఘనంగా వీడ్కోలు పలికారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన విగ్రహాల్లో సుమారు 45 శాతానికి పైగా మట్టి విగ్రహాలే ఉండటం విశేషం. సుమారు 2400 విగ్రహాలు, 2000 మంది పోలీస్‌ల బందోబస్తు, 2000 మంది స్వచ్ఛంద సేవకులతో వినాయక నిమజ్జనం శోభాయమానంగా సాగింది.



కర్నూలు నగరంలో కొండారెడ్డి బురుజు మీదుగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

## క్లుప్తంగా

### న్యాయం చేయండి


కొత్తపల్లి: తనపై దాడి చేసిన భర్త శివలింగంతో పాటు అత్త లక్ష్మమ్మను కూడా కఠినంగా శిక్షించాలని బండినాయినిపాలెం గ్రామానికి చెందిన జ్యోతి కోరారు. ఈమెపై ఈనెల 5వ తేదీన భర్త మద్యం తాగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన భర్తతోపాటు అత్తపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా శివలింగంను మాత్రమే అరెస్టు చేశారని ఆదివారం బాధితురాలు విలేకరులకు వెల్లడించారు. తన ఇద్దరు పిల్లల భవిష్యత్తు అంధకారం కాకుండా చూడటంతో పాటు అత్త లక్ష్మమ్మపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆర్టీసీ కాలనీలో చోరీ

కర్నూలు: కర్నూలు శివారులోని డోన్ జాతీయ రహదారి పక్కన మిస్టర్ ఇడ్లీ హోటల్ వెనుక భాగంలోని ఆర్టీసీ కాలనీ మూడోలైన్‌లో నివాసముంటున్న సత్యనారాయణ గుప్త ఇంట్లో దొంగలు పడి ఉన్నదంతా దోచుకెళ్లారు. ఈ కాలనీలో ఎక్కువ భాగం ఉద్యోగస్థులు నివాసముంటున్నారు. సెలవుల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లిన సందర్భంలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సత్యనారాయణ గుప్త ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం ప్రకాష్‌నగర్‌లో ఉన్న పాత ఇంటికి వచ్చాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి గేటుతో పాటు ప్రధాన వాకిలికి ఉన్న తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి పట్టుచీరలు, బియ్యం బస్తాలతో పాటు సీసీ కెమెరా హార్డ్ డిస్క్, దేవుని గుడిలోని హుండీ చోరీ చేశారు. అల్మారాల్లో ఉన్న సామాన్లు, బట్టలన్నీ చిందరవందరగా పడేశారు. ఇంటి ముఖ ద్వారం కూడా పగలగొట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సత్యనారాయణగుప్త ఇంటికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులతో పాటు ఫింగర్‌ప్రింట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆధారాలను సేకరించారు. ఇదే కాలనీలో నివాసముంటున్న ఇద్దరు కానిస్టేబుళ్ల ఇళ్లల్లో కూడా ఇటీవల దొంగతనం జరిగినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కాలనీ దిన్నెదేవరపాడు గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుంది. వీధి లైట్లు సరిగా లేకపోవడం వల్ల రాత్రిపూట దొంగలకు అవకాశంగా మారిందని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామానికో శంకర్‌దాదా!

- ఆర్‌ఎంపీలే స్పెషల్ సర్జన్లు
- పేద రోగుల ప్రాణాలతో చెలగాటం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం



గడివేముల: విద్యార్హతలు లేకపోతేనేం.. ఎలాంటి జంకూ లేకుండా తెల్లకోటు తొడుక్కుంటున్నారు. అన్ని రకాల రోగాలకూ చికిత్స చేసేస్తున్నారు. ఆపరేషన్లు సైతం చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. కొందరు ఆర్‌ఎంపీలే స్పెషల్ సర్జన్లగా అవతారమెత్తి పేదల రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నగరాల్లోని పెద్దాసుపత్రికి వెళితే ఖర్చు భరించలేమన్న కారణంతో పేద జనం వీరిని ఆశ్రయిస్తున్నారు. గ్రామానికి ఓ క్లినిక్ పెట్టుకుని ఆర్‌ఎంపీలు దర్జాగా వైద్యం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ల్యాబ్‌లు కూడా నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. మరి కొందరైతే మెడికల్ దుకాణాల్లోనే ఏకంగా అన్ని రకాల వైద్య చికిత్సలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**నిబంధనలు ఇలా..**

నిబంధన ప్రకారం ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజెక్షన్లు ఇవ్వకూడదు. ఎవరైనా జ్వరంతో బాధపడుతూ వస్తే సాధారణ మాత్రలే ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫార్సు చేయాలి. కొందరు ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారు. ప్రతి సమస్యకు ఇంజక్షన్ ఇచ్చేస్తున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయోటిక్స్, స్టిరాయిడ్స్ వంటివి సూచిస్తున్నారు. వీటివల్ల రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతోంది. గర్భిణులు, చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్స చేయకూడదు. ఫార్మసీ సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకుని మందుల దుకాణాలు నిర్వహించడం కూడా నిబంధనలకు విరుద్ధమే. ఇలాంటి డమ్మీ డాక్టర్లపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది.

**ఇంజక్షన్లు ప్రాణాంతకం**

కొందరు ఆర్‌ఎంపీలు వేసే ఇంజక్షన్లు వికటించి రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఏ వయసు వారికి ఎంత డోస్ ఇవ్వాలో వీరికి తెలియడం లేదు. వ్యాధి త్వరగా తగ్గిపోవాలన్న కారణంతో అధికంగా డోసు ఇస్తున్నారు. ఫలితంగా ఇన్‌జెక్షన్ ఇచ్చిన అనంతనం తీవ్ర అస్వస్థతకుగురవుతున్నారు. వాంతులు చేసు కోవడం, శరీరమంతా దద్దుర్లు రావడం వంటి లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. పరిస్థితి అదుపులోకి రాకపోగా రోగులు కొందరు కోమాలోకి వెళ్తున్నాడు.

**అన్ని రకాల రోగాలకు చికిత్సలు**

కొందరు ఆర్‌ఎంపీలు అన్ని రోగాలకు చికిత్స చేస్తున్నారు. కొన్ని రోజుల కిందట గడివేముల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆయాసంతో పాటు చెమట పడుతోందని ఓ ఆర్‌ఎంపీ వద్దకు వచ్చాడు. ఇందుకు భయపడాల్సిన అవసరం లేదని ఏమీ లేదని, సెలైన్ బాటిల్‌ను పెట్టాడు. బంధువులు,స్నేహితులు గమనించి సెలైన్ బాటిల్‌ను మధ్యలోనే తొలగించి కారులో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు గుండెకు సంబంధించిన సమస్య ఉందని, కొంచెం ఆలస్యం జరిగితే చనిపోయేవాడని వైద్యులు చెప్పారు.

- మండల కేంద్రమైన గడివేములలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తున్న మహిళ కొన్ని రోజుల కిందట కురిసిన వర్షానికి జారిపడింది. వెంటనే ఆర్‌ఎంపీ వద్దకు తీసుకురాగా ఏమి కాలేదని, ఐదు రోజులు మందులు వాడితే సరిపోతుందని సలహా ఇచ్చాడు. మందులకు రూ.2 వేల దాకా బిల్లు చేశాడు. వారం రోజులు దాటినా నొప్పి తగ్గకపోవడంతో పాటు మంచం నుంచి లేచి తిరగలేని పరిస్థితి నెలకొంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తన భర్త సాయంతో వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా.. కాలు విరిగిందని, శస్త్ర చికిత్స చేసి పంపారు.

**ధనార్జనే ధ్యేయంగా...**

కొందరు ఆర్‌ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తున్నారు. ప్రథమ చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. కొన్ని చోట్ల క్లినిక్‌ల్లో మందుల దుకాణంలు అన్నీ ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.. పరిమితులు దాటి చేస్తున్న వైద్యం రోగుల ప్రాణం మీదకు వస్తోంది. తక్కువ డబ్బుతో వైద్యం అందుతుందన్న కారణంతో పేదలు క్యూకడుతున్నారు. ఇదే అదనుగా వీరు జేబులు నింపుకునే పనిలో పడ్డారు.

### చర్యలు తీసుకుంటాం

ఆర్‌ఎంపీలు ఇష్టానుసారంగా వైద్యం చేయకూడదు. ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం చేసుకోవాలి. ఇంజక్షన్‌లు వేయడం, సెలైన్‌లు పెట్టడం, ఆపరేషన్లు చేయడం చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ప్రజలు ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఆర్‌ఎంపీలపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి, తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల జిల్లా

# దైవరాధనతో ప్రశాంత జీవనం



లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న రూపేశ్వర చైతన్య దాస్

కోడుమూరు రూరల్: దైవరాధనతో ప్రశాంత జీవనాన్ని గడపవచ్చునని ఇస్కాన్ సంస్థ ప్రధాన సేవకులు రూపేశ్వర చైతన్య దాస్ అన్నారు. కోడుమూరులో నిర్మాణంలో ఉన్న హరి హర క్షేత్ర లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయాలను ఆదివానం ఆయన సందర్శించారు. కోడుమూరులో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి దాతల సహకారంతో పూర్తిగా రాతి శిలలతో నిర్మిస్తున్న లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం భవిష్యత్‌లో మరింత ఖ్యాతిని గడిస్తుందన్నారు. ఆలయ సన్నిధిలో భవిష్యత్‌లో ఉచితంగా అన్నదానం, కల్యాణాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఇస్కాన్ సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు, కోడుమూరులోను సేవా సంస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సేవకులు మద్దిలేటి, లక్ష్మీవెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వేణుగోపాల్, తిమ్మారెడ్డి, ఎద్దుల సూర్య రెడ్డి, సత్యరెడ్డి, విజయ్, గంగాధర్, కిశోర్, వెంకటేశ్వరెడ్డి, సుధాకర్, శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు విజయభాస్కరరెడ్డి, రవి కుమార్, చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పూలు కాదు.. పుట్టగొడుగులు





పుట్టగొడుగులంటే ఇష్టపడని వారు ఉండరు. అందులోనూ నల్లమల అడవుల్లో లభించే సహజ సిద్ధమైన పుట్టగొడుగులంటే మహా రుచికరంగా ఉంటాయి. సాధారణంగా అక్కడక్కడ ఒకటి, రెండు కనిపించే పుట్టగొడుగులు పుష్పాల్లా ఒకేచోట వందల సంఖ్యలో కనిపిస్తూ నల్లమలలోని నల్లటి నేల మీద తెల్లటి పుష్పాల్లా కనువిందు చేస్తున్నాయి. ఎన్నో పోషకాలకు పుట్టగొడుగులు పెట్టింది పేరు. మహానంది ఆలయం వెనుక నల్లమల అడవిలో ఒకేచోట పువ్వులా కనిపించిన ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. – మహానంది



### వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

బొమ్మలసత్రం: పోలీసులు సకాలంలో స్పందించి ఆత్మహత్యకు యత్నిస్తున్న ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన మానస(22) ఆదివారం కుటుంబ కలహాలతో ఉరివేసుకుని చనిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య మరణాన్ని తట్టుకోలేక భర్త అశోక్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు బొమ్మలసత్రం సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. చనిపోతున్నట్లు తన మొబైల్‌లో సెల్ఫీ వీడియో తీసి బంధువులకు వాట్సాప్ చేశాడు.వారు వెంటనే ఆందోళనకు గురై ఎస్పీ కార్యాలయానికి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు అశోక్ మొబైల్ నంబర్‌ను ట్రేస్ చేసి ఘటనా స్థలానికి చేరుకుని అతడిని కాపాడారు. తర్వాత త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు.

### ఆరుగురిపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: నాలుగు రోజుల క్రితం జూపాడుబంగ్లాలో జరిగిన వినాయక నిమజ్జనంలో యువకుల మధ్య మాటామాట పెరిగి గొడవ జరిగింది. ఈ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 14న జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన ఇప్పెవిజయ్, చరణ్, ప్రభాస్ అనే యువకులను అదే గ్రామంలోని కాసానగర్ కాలనీకి చెందిన చిన్న, శ్యాము, వినోదు, సందీప్, సింహాద్రి, వినోద్ ఇంటి నుంచి బైక్‌లపై మోడల్‌స్కూల్ వెనుక ప్రాంతానికి పిలుచుకెళ్లారు.నిమజ్జనంలో తమ వాళ్లను పక్కకు తోసేస్తారా అని దుర్భాషలాడి కొట్టారు. తర్వాత ఈ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. వైరల్ కావడంతో బాధితులు, వారి తల్లి దండ్రులు గమనించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన పై ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- రూ.3లక్షల విలువ చేసే మద్యం స్వాధీనం
- ఐదుగురు వ్యక్తుల అరెస్టు
- నాలుగు వాహనాలు సీజ్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: కర్ణాటక నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం కోడుమూరు పోలీసులు పట్టుకున్నారు. మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు, రెండు బొలెరో, రెండు బైక్‌లను కూడా పోలీసులు సీజ్ చేశారు. కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణగిరి మండలం పెనుమాడకు చెందిన మోహన్‌గౌడ్, సంగాలకు చెందిన శివ, శంకర్‌గౌడ్, కప్పట్రాళ్లకు చెందిన వీరకృష్ణ, సి.బెళగల్ మండలం చెరువుపల్లెకు చెందిన యుగంధర్‌గౌడ్ నెల రోజుల నుంచి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు. వీరికి క్రిష్ణగిరి మండలం అమకతాడుకు చెందిన గురుస్వామి మద్యాన్ని తరలించేందుకు బొలెరో డ్రైవర్‌గా వ్యవహరిస్తున్నారు. మద్యం తరలించే సమయంలో పోలీసులకు దొరకకుండా మరొక బొలెరో వాహనాన్ని పైలెట్ వాహనంగా పెట్టుకుని వీరు మద్యం తరలించేవారు. ఎప్పటిలాగే కోడుమూరు మండలంలోని క్రిష్ణాపురం గ్రామ పొలిమేరలో కొందరు వ్యక్తులు బొలెరో ట్రాలీ వాహనం నుంచి ఇంకో బొలెరో వాహనం, ద్విచక్ర వాహనాలపైకి రూ. 3 లక్షల విలువైన 75 మద్యం బాక్స్‌లు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. సమాచారం మేరకు కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తన పోలీస్ సిబ్బందితో దాడి చేసి మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను చేశారు. సంగాలకు చెందిన జయన్న అనే వ్యక్తి పారిపోయినట్లు ఎస్‌ఐ వివరించారు. కాగా మద్యం తరలింపు కేసులో మరికొందరు వ్యక్తుల పాత్ర ఉందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం స్వాధీనం కేసులో చురుకుగా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది ఏఎస్‌ఐ సురేంద్ర, కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డులు రాముడు, శేఖర్‌ను ఎస్‌ఐ అభినందించారు.

**తెలంగాణ మద్యం పట్టివేత**

కర్నూలు: గణేష్ నిమజ్జనం దృష్ట్యా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అనధికార మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కర్నూలు స్టేషన్ సీఐ కెఆర్ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు, ఎస్‌ఐలు మారుతి, వీరస్వామి తమ సిబ్బందితో నగర శివారులో వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైపు నుంచి కర్నూలుకు వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో తెలంగాణ మద్యం బయటపడింది. ఆటోలో ఉన్న కల్లూరు మండలం ముజఫర్‌నగర్‌లో కిరణ్‌కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్రం పుల్లూరు గ్రామానికి చెందిన బోయ సీతారాముడును అదుపులోకి తీసుకుని విచారించగా వ్యాపారం నిమిత్తం మద్యం తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. ఇరువురి వద్ద 222 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో 'సాక్షి' ఉద్యోగులకు తీవ్ర గాయాలు

కర్నూలు: నగర శివారు డోన్ జాతీయ రహదారి రింగ్ రోడ్డు సమీపంలోని గోశాల దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో 'సాక్షి' సబ్ ఎడిటర్లు రామిరెడ్డి, గోవర్ధన్ తీవ్ర గాయాలకు గురయ్యారు. నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి దూపాడు దగ్గర ఉన్న సాక్షి కార్యాలయానికి ఇరువురూ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గోశాల వద్ద ఆదివారం సాయంత్రం 4:20 గంటల సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఇద్దరూ అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉండగా వెనుక నుంచి వెళ్లిన మరికొంత మంది సాక్షి ఉద్యోగులు గుర్తించి కార్యాలయంలో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని కర్నూలులోని శ్రీచక్ర హాస్పిటల్‌కు తరలించి ప్రాథమిక వైద్యచికిత్సలు చేయించారు. గోవర్ధన్ కొద్దిగా కోలుకోగా, రామిరెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో డాక్టర్లు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే ఉలిందకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

### కేసీలో ఆర్మీ జవాన్ గల్లంతు

కర్నూలు కల్చరల్: ప్రమాదవశాత్తూ కేసీ కెనాల్‌లో ఆర్మీ జవాన్ గల్లంతయ్యాడు. స్థానిక బీక్యాంప్‌కు చెందిన పవన్ కల్యాణ్ (23) ఐదు ఏళ్ల క్రితం ఆర్మీలో చేరారు. కర్నూలుకు వచ్చిన ఆయన శనివారం రాత్రి స్నేహితులతో కలిసి స్వామిరెడ్డి నగర్‌లోని వినాయక విగ్రహం దగ్గర గడిపారు. ఆదివారం తెల్లవారు జామున కేసీ కెనాల్‌లో ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. అతని తండ్రి భాస్కర్‌లో కలెక్టరేట్‌లో ఉద్యోగి. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆట్యా–పాట్యా పోటీల్లో సత్తా చాటిన పల్నాడు

- బాలికల విభాగంలో కర్నూలుకు మూడవ స్థానం



రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచిన కర్నూలు జిల్లా బాలికల జట్టు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు కొనసాగుతున్న 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల ఆట్యా–పాట్యా పోటీల్లో పల్నాడు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పల్నాడు, నెల్లూరు, ప్రకాశం జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో పల్నాడు, అనకాపల్లి, కర్నూలు జిల్లా జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు కైవసం చేసుకున్నాయి. ఆయా జట్ల క్రీడాకారులకు అతిథులు డాక్టర్ వాసురెడ్డి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సుబ్బారెడ్డి మెడల్స్, కప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ జీవితంలో ముందుకు సాగాలన్నారు. పోటీల్లో ఎవరూ గెలిచిన ఓడినా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆట్యా పాట్యా సంఘం అధ్యక్షుడు నాగరత్నమయ్య పాల్గొన్నారు.

# కొర్ర రైతుకు ధరాఘాతం

- పడిపోయిన ధరలు
- గతంలో క్వింటా రూ.7,000
- నేడు రూ.3,000 లోపే
- ఈ ఏడాది భారీగా పెరిగిన కొర్ర సాగు
- రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం



ఖరీఫ్‌లో సాగు చేసిన కొర్ర

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో కొర్రల ధర పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గతేడాది డిసెంబరు నెలలో లభించిన ధరతో పోలిస్తే నేడు సగం కూడా దక్కడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో కొర్రలకు కూడా కనీస మద్దతు ధర నిర్ణయించారు. మద్దతు లేనప్పుడు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతు భరోసా కేంద్రాల వారీగా కొనుగోలు చేసేవారు. ఇప్పుడు కొర్రల ధర పడిపోయి రైతులు అల్లాడుతున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు కొద్ది రోజులుగా కొర్రలు అమ్మకానికి వస్తున్నాయి. అతి తక్కువ ధర లభిస్తుండటంతో రైతులు కన్నీళ్లతో ఇంటికి వెళ్తున్నారు.

**పెరిగిన సాగు విస్తీర్ణం**

గతేడాది పండించిన కొర్రలకు గిట్టుబాటు ధరలు లభించాయి. ఎపుడూ లేని విధంగా క్వింటాకు రూ.6,000 నుంచి రూ.7,000 వరకు ధర వచ్చింది. ఈ ధరలు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ వరకు ఉన్నాయి. కొర్రలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు ఈ పంటను ఎక్కువగా సాగు చేశారు. జిల్లాలో కొర్ర సాధారణ సాగు 4,210 ఎకరాలు మాత్రమే ఉండగా, రికార్డు స్థాయి లో 15,420 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడటంతో దిగుబడులు కూడా బాగా నే ఉన్నాయి. ధరలు మాత్రం రైతులను ఆందోళనలోకి నెట్టాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటా కొర్రలకు కనిష్టంగా రూ.2410, గరిష్టంగా రూ.3,329 ధర లభించింది. సగటు ధర రూ.2,870 నమోదైంది. ఈ నెల 10న కొర్రలకు గరిష్ట ధర రూ.2,896 ఉండగా.. సగటు ధర రూ.2583 లభించింది. రైతులకు గిట్టుబాటు ధర కాదు గదా... మద్దతు ధర కూడా లభించడం లేదు. ఒకవైపు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామంటున్న కూటమి ప్రభుత్వం ధరలు పడిపోయి రైతులు అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదు.



కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన కొర్రలు

**మద్దతు ధరతో కొనుగోలు లేనట్లే...**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్వింటా కొర్రలకు రూ.2,500 మద్దతు ధర ప్రకటించింది. ఇంతకంటే ధర తగ్గితే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేయించేది. అప్పటి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 150 టన్నులు కొనుగోలు చేసింది. ప్రస్తుతం కొర్రలు మార్కెట్‌లోకి వచ్చి ధర లేక రైతులు ఆందోళనకు గురువుతున్నా 'మద్దతు' ఊసే లేకుండా పోయింది. రైతులు నష్టపోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

### పెట్టుబడి కూడా రాలేదు



మేం ఖరీఫ్‌లో 7 ఎకరాల్లో కొర్ర సాగు చేశాం. ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టాం. దిగుబడి ఎకరాకు 6 క్వింటాళ్ల వరకు వచ్చింది. పండించిన కొర్రలను మార్కెట్‌కు తెచ్చాం. ఇక్కడ వ్యాపారులు క్వింటాకు రూ.2,870 మాత్రమే ధర వేశారు. పెట్టుబడి వ్యయం కూడా లభించలేదు. కనీసం రూ.4,000 ధర లభిస్తే కొంత మేర గిట్టుబాటు అవుతుంది. గత ఏడాది రూ.6,000కు పైగా ధర లభించింది. ధర తీవ్ర నిరాశకు గురి చేసింది.

– సూర్యనారాయణ రెడ్డి, కొట్టాల, క్రిష్ణగిరి మండలం

### ప్రభుత్వం స్పందించాలి



పోయిన సంవత్సరం కొర్రలకు ధర బాగుండటంతో ఈ సారి మూడు ఎకరాల్లో చేశాం. ఎకరాకు 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వ్యయ ప్రయాసలతో మార్కెట్‌కు తెస్తే ఇక్కడ క్వింటా రూ.2900 ధర లభించింది. పండించిన కొర్రలు అమ్ముకుంటే కోతలు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు కూడా రాలేదు. కేవలం ఐదారు నెలల్లోనే ధర ఈ విధంగా పడిపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం చొరవ తీసుకొని క్వింటాలు రూ.4,000 ప్రకారం కొనుగోలు చేస్తేనే రైతులకు ఊరట లభిస్తుంది. – బాలిరెడ్డి, తొగర్చేడు, కృష్ణగిరి మండలం